క్లుప్తంగా

మంచి వక్తగా రాణించేందుకు శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: మంచి వక్తగా రాణించాలని ఉందా..అయితే దానికి సంపూర్ణ శిక్షణ అవసరం. ఇందుకు రెండు రోజులు శిక్షణ పొందితే చాలు. మంచి వక్త కావాలనుకున్న వారికి గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, నెక్కల్లు గ్రామంలో ఈనెల 30, 31 తేదీల్లో ఉచిత వక్తగా రాణించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు స్థానిక విశ్వభారతి డిగ్రీ కళాశాల డైరెక్టర్, ప్రముఖ సైకాలజిస్ట్ జిల్లా తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెక్కల్లు గ్రామంలోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతిగాంచిన ఉపన్యాసకులు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణ జరిగే రెండు రోజులు ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు నిర్వాహకులే ఏర్పాటు చేశారన్నారు. ఔత్సాహికులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 98483 83398లో సంప్రదించాలని తెలిపారు.

ఐక్యంగా కృషి చేయాలి

వీరులపాడు: క్రైస్తవ సేవకులు ఐక్యంగా ఉంటే ప్రతి సమస్యను పరిష్కరించుకోవచ్చని మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బీఎస్ పాల్ పేర్కొన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలోని బాప్టిస్ట్ ఫాస్టర్ ఇమ్మానుయేల్ చర్చిలో మంగళవారం మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ప్రతికూల పరిస్థితులలో సైతం మన సమస్యలను పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. క్రైస్తవులంతా ఒకే మాట, ఒకే మనసు కలిగి ఉండి తోటి వారికి మంచి చేసేలా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హానోక్, సీయోన్ కుమార్, సంసోను, సామ్యేలు రాజ్, స్వామిదాసు, హిజ్కియా రాజు, అబ్రహం, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



వీరులపాడు: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్ల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా అల్లర్లు, ఘర్షణలకు యత్నించినా సహించేది లేదన్నారు. నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచటం జరిగిందని, ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా నడుచుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించినా చట్టాన్ని చేతిలోకి తీసుకోవాలని చూసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లిపెసర విత్తనాలు సిద్ధం

జగ్గయ్యపేట: మండలంలోని రైతులకు పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి వరలక్ష్మి మంగళవారం పేర్కొన్నారు. అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం మొదటి విడతగా 50 క్వింటాళ్ల పిల్లిపెసరను అందుబాటులో ఉంచిందన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో జీలుగ విత్తనాలు కూడా వస్తాయని తెలిపారు. పిల్లిపెసర విత్తనాలను రెండు రోజుల్లో రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా అప్ గ్రేడ్ అయిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. బైపీసీ, సీఈసీలో జాయిన్ అవ్వాలనుకునే విద్యార్థుల కోసం అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

దాతల సాయంతో మజ్జిగ పంపిణీ



నందిగామ: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సాయంతో మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వేసవి కాలంలో మూడు నెలల పాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి నిత్యం దాతల సాయంతో చల్లటి తాగునీటితోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం అభినందనలు తెలిపారు.

మళ్లీ పెన్షన్.. టెన్షన్

- తలుపు తట్టి పెన్షన్లు ఇచ్చిన వలంటీర్లు దూరం
- ఇవేమి కష్టాలు అంటున్న పెన్షన్‌దారులు
- నియోజకవర్గంలో 34,047 మంది పెన్షన్‌దారులు



పెన్షన్ కోసం బ్యాంక్ వద్ద వేచిఉన్న లబ్ధిదారులు (ఫైల్)

పెనుగంచిప్రోలు: ఒకటో తేదీ వస్తోందంటే పెన్షన్ దారుల్లో టెన్షన్ పుడుతోంది. పెన్షన్ అందుకుంటారనే ఆనందం కంటే..బ్యాంక్‌లు, సచివాలయాల వద్ద పడే వ్యయప్రయాసలు గుర్తుకు తెచ్చుకుని ఆవేదన చెందుతున్నారు. రెండు నెలలుగా వారు పడుతున్న అవస్థలు అనేకం. ఇప్పుడు మూడో నెల వస్తోంది. మళ్లీ ఎన్ని తిప్పలు పడాల్సి వస్తుందో అని ఆవేదన చెందుతున్నారు.

గత ఇబ్బందుల నుంచి..

గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ సొమ్ము కోసం అధికారుల ముందు చేతులు కట్టుకుని ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూసే పరిస్థితి ఉండేది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల జీవితాల్లో సామాజిక గౌరవాన్ని పెంచాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ అందించారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో ఉన్నా, తప్పనిసరి పరిస్థితుల్లో వేరే ఊళ్లకు వెళ్లినా వారిని వెతుక్కుంటూ వెళ్లి వలంటీర్లు పెన్షన్ అందించేవారు. ప్రతి నెలా ఒకటో తేదీన తలుపుతట్టి పెన్షన్ అందించటంతో పాటు వారి యోగక్షేమాలు తెలుసుకునేవారు. టీడీపీ దాని మిత్ర పక్షాలు కుట్రలు, ఎన్నికల సంఘ ఆదేశాలతో గత రెండు నెలలుగా పెన్షన్ అందుకోవటానికి లబ్ధిదారులు పడ్డ పాట్లు వర్ణనాతీతం. ఇప్పుడు జూన్ నెల పరిస్థితి ఎలా ఉంటుందో అని పెన్షన్ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

బ్యాంక్ ఖాతాల్లో జమ..

నియోజకవర్గంలో మొత్తం 34,047 మంది వివిధ పెన్షన్‌దారులు ఉండగా గత నెల 25,508 మందికి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారు. నడవలేని వారు, దివ్యాంగులు 8,539 మందికి నేరుగా సచివాలయ సిబ్బంది నగదు అందజేశారు. బ్యాంకుల్లో నగదు తీసుకోవటంలో పింఛన్ దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. బ్యాంక్ ఖాతాలు పనిచేయక పోవటం, ఆధార్ అనుసంధానం కాకపోవటం, మండుటెండలో ఇతర గ్రామాల నుంచి బ్యాంక్ వద్దకు రావటం వంటి అనేక సమస్యలు పెన్షన్‌దారులను బాధించాయి. తమకు వలంటీర్ల ద్వారా అందుకునే రోజులు మళ్లీ ఎప్పుడు వస్తాయాని ఎదురు చూస్తున్నారు.

మళ్లీ అవే తిప్పలు..



ఒకటో తేదీన పెన్షన్ వస్తుందని ఆనందపడాలో...పెన్షన్ కోసం పడే తిప్పలు తలుచుకుని బాధపడాలో అర్థం కావటం లేదు. పెన్షన్ తీసుకోవాలంటే పెనుగంచిప్రోలు బ్యాంక్‌కు వెళ్లాలి. నా వయస్సు 70 సంవత్సరాలు. ఇంటి నుంచి బయటకు వెళ్లలేను. గత నెలలో పడిన బాధలు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి.

–వడ్లమూడి గురునాథం, సుబ్బాయిగూడెం

ఇబ్బందులు పడుతున్నాం..



జగన్‌బాబు మళ్లీ ముఖ్యమంత్రి అవ్వగానే మాకష్టాలు తొలగిపోతాయి. వలంటీర్లు చక్కగా ఇంటి కొచ్చి పెన్షన్ అందిస్తుంటే అడ్డుకోవటం దారుణం. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. మండుటెండలో పెన్షన్ కోసం వరుసలో నిలబడి పడరాని పాట్లు పడ్డాం.

–రాములమ్మ, నవాబుపేట

శ్మశాన వాటికలో అగ్నిప్రమాదం



శ్మశానవాటికలో ఎగిసి పడుతున్న మంటలు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో హిందూ శ్మశాన వాటికలో మొక్కలు అగ్నికి ఆహుతయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. శ్మశాన వాటికలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి మొక్కలు, చెట్లు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. నందిగామ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం కలిగిందని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం తెలిపారు. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియటం లేదన్నారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి

మేడూరు(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్వామి వారి జయంతి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. కలశ స్థాపన, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, అనంతరం 108 బిందెల జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. 31వ తేదీన వీరాంజనేయస్వామికి 108 బిందెల పంచామృతాలతో అభిషేకం జరుగుతుంది. జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 108 బిందెలతో పంచామృత స్నానం, తమలపాకులతో అర్చన, సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. మూడు రోజులు మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుంది. గోసవీడు భక్తాంజనేయస్వామి, ఆర్లపాడు అభయాంజనేయస్వామి ఆల యాల్లో హనుమజ్జయంతి నిర్వహిస్తామని కమిటీ సభ్యులు వివరించారు.

కిశోర బాలికలు అపోహలు వీడాలి

తిరువూరు: యుక్త వయస్సులో ఉన్న బాలికలు తమ శారీరక సమస్యలపై అపోహలు వీడాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం అన్నారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. రుతుక్రమం ఎటువంటి వ్యాధి కాదని, ఈ సమయంలో ఆడవారిని తాకరాదని, బాలికలు పాఠశాలకు వెళ్లకూడదని కొందరుభావించడం సరికాదన్నారు. రుతుక్రమం సాధారణ శరీర ప్రక్రియగా భావించాలని, ప్రతి ఆడపిల్లలో 10–14 సంవత్సరాల నడుమ ఈ రుతుక్రమం ప్రారంభమై 50 ఏళ్ల వరకు కొనసాగుతుందన్నారు. కె. రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో.. మున్నేటి తీరం

- అధికారుల్లో కొరవడిన చిత్తశుద్ధి
- చెత్త డంప్ చేస్తున్నా పట్టించుకోని వైనం
- దెబ్బతింటున్న ఆహ్లాదకర వాతావరణం



మున్నేటి తీరంలో పేరుకుపోయిన చెత్త

నందిగామ: నందిగామ ప్రాంతానికి ఉన్న ఒకేఒక్క ఆహ్లాదకర ప్రాంతం మున్నేటి తీరం. పట్టణానికి దూరంగా, ఎంతో ఆహ్లాదంగా ఉండే వాతావరణం . చుట్టూ కొండలు, మున్నేటి చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. దీంతో పర్యావరణ ప్రేమికులు ఇక్కడకు వచ్చి కొద్ది సేపు సేద తీరుతుంటారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఉదయం, సాయంత్రం సమయాల్లో మానసిక ప్రశాంతత కోసం ఇక్కడకు వస్తుంటారు. దీనికి తోడు సాయంత్రం వేళ కొందరు ద్విచక్ర వాహనాలు, కార్లపై వచ్చి ఇక్కడ నుంచి వచ్చే ప్రశాంతమైన గాలిని ఆస్వాదిస్తారు.

అధికారుల నిర్లక్ష్యం..

మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. కొంత కాలంగా ఈ ప్రాంతంలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం కారణంగా ఎవరూ ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు. పట్టణ ప్రజలకు పార్కు సౌకర్యం లేకపోవడంతో ఎక్కువ మంది సాయంత్రం వేళ కొద్దిసేపు ప్రకృతిని ఆస్వాదించేందుకు మున్నేటి తీరానికి వెళ్తుంటారు. ఈ క్రమంలో అక్కడ నెలకొన్న అపరిశుభ్ర వాతావరణన్ని చూసి ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మినీ డంపింగ్ యార్డుగా..

తీర ప్రాంతం చెత్త, మాంసం వ్యర్థాలు, వినియోగించిన కొబ్బరి బోండాలు, బూడిద వంటి వాటితో మినీ డంపింగ్ యార్డుగా మారింది. మాంసం వ్యర్థాలను, పలు హోటళ్లల్లో వినియోగించిన వరిపొట్టు బూడిద వంటి అనేక రకాల వ్యర్థ పదార్థాలు చిన్న, పెద్ద బ్రిడ్జిల రహదారి వెంట డంప్ చేస్తున్నారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. వ్యర్థాలు ఎక్కువ రోజులు ఉండటం వల్ల కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది.

కమ్మేస్తున్న పొగ..

మున్నేటి తీరంలో చెత్త అధికంగా పేరుకుపోయిన సందర్భాల్లో వీటిని తగులబెడుతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకోవడంతో పాటు ప్లాస్టిక్ సంచులు, వస్తువులు దగ్ధమవుతుండటంతో భరించలేని దుర్గంధం వెలువడుతుండటమే కాకుండా వాతావరణం సైతం కాలుష్యమవుతోంది. నిత్యం ప్రయాణికులు, వాహనాల రాకపోకలతో ఎంతో బిజీగా ఉండే ఈ రహదారిని పొగ ఆక్రమించుకుంటుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగ వల్ల రోడ్డు కనపడక ప్రమాదాల బారిన పడిన వారు సైతం అనేక మంది ఉన్నారు. అధికారులు స్పందించి ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తాం..

పట్టణ పరిధిలో రోజుకు 24 టన్నుల వ్యర్థాలు సేకరించడం జరుగుతోంది. వాటిని పల్లగిరి గుట్ట సమీపంలో డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. చిన్న, పెద్ద బ్రిడ్జిల సమీపంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు చెత్త వేస్తున్నారన్నారు. వెంటనే అటువంటి వారిని గుర్తించి నోటీసులు అందజేస్తామని తెలిపారు.

–గురునాథం, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాజకీయ పార్టీలు సహకరించాలి

వెస్ట్ జోన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి, ఎం.సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని వెస్ట్ జోన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి అన్నారు. జూపూడి నోవా, నిమ్రా కళాశాలల్లో జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎన్నికల కౌంటింగ్ నియమావళిపై ఇబ్రహీంపట్నంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుమికూడరాదని చెప్పారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, డీజే బాక్స్‌లతో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లకు అనమతి లేదన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అవరోధాలను అధిగమిస్తే విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మార్కెటింగ్‌లో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తే మంచి విజయాలను పొందవచ్చని ఫైన్ ల్యాబ్స్ సేల్స్ మేనేజర్ పి.నరేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మార్కెటింగ్ అవకాశాలు – అవరోధాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మార్కెటింగ్ ఆ సంస్థల విజయావకాశాలను ప్రభావితం చేస్తాయన్నారు. మార్కెటింగ్‌లో రాణిస్తే ఆ సంస్థ అద్భుతమైన విజయాలను, దానితో పాటుగా ఆర్థికశక్తిని పెంచుకోవటానికి అవకాశాలు ఉంటాయన్నారు. అయితే మార్కెటింగ్‌లో చాలా అవకాశాలతో పాటుగా అవరోధాలు సైతం ఎదురవుతాయన్నారు. విద్యార్థులు అవరోధాలను అధ్యయనం చేసినప్పుడు సమస్యలు వాటి పరిష్కారాలు తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ఏ రంగంలోనైనా అవగాహన, అధ్యయనం లేకుండా మార్కె టింగ్ అంశంలో రాణించటానికి అవకాశం ఉండదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో అంశాలను తెలుసుకోవటానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు



కంచికచర్ల గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

కంచికచర్ల: వేసవికాలంలో గ్రంథాలయంలో జూన్ 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్, మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్, యోగా నేర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర రావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, యోగా గురువు నవీన్‌నాని, ఎం.మల్లిఖార్జునరావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాస రావు విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

జగ్గయ్యపేట అర్బన్: పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు, సుమతి, వేమన శతకం పద్యాలు చదివించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిష్ గ్రామర్‌లోని వెర్బ్, ప్రొనౌన్స్ ఉపయోగించే విధానాన్ని నేర్పించారు. ప్రభుత్వ పాఠశాల పీఈటీ మణిరత్నం విద్యార్థులకు ఆహారం, పౌష్టికాహారం అలవాట్లపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు డి.బాబురావు, వర్షిత, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి



రజీమ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నేతలు

కంచికచర్ల: దీక్ష డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు షేక్ రజీమ్ (42) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. రజీమ్ భార్య స్టాఫ్ నర్స్‌గా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రజీమ్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు రజీమ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రజీమ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటంతో పాటు తక్కువ ఫీజులతో విద్య బోధించేవాడని గుర్తుచేశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేశాడని అన్నారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు నంబూరు నరసింహారావు, అమర్లపూడి యోహాన్, వేల్పుల శ్రీనివాసరావు, చల్లా బ్రహ్మేశ్వరరావు, దేవరకొండ గురవయ్య, గోగినేని వెంకటేశ్వరరావు, తంగిరాల సృజనీకుమార్, షేక్ ఖాసీం, గుదే నాగవరప్రసాద్, కేవీ కృష్ణారావు, అజయ్‌కుమార్, జాఫర్ తదితరులు ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

గౌరవరం(జగ్గయ్యపేట): జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎన్నికల లెక్కింపు ముగిసిన రెండురోజుల వరకు విజయోత్సవ ర్యాలీలు, బాణ సంచా కాల్చడం నిషేధించినట్లు ఎస్ఐ సతీష్ పేర్కొన్నారు. గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు అనంతరం విజయం సాధించిన అభ్యర్థుల తరపున నాయకులు, కార్యకర్తలు హడావిడి చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ ఆరు వరకు బహిరంగ సభలు, తదితరాలను నిర్వహించవద్దని సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, రెచ్చగొట్టేలా పోస్టింగులు పెట్టినా, ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి నడిపినా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయటంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణకు అత్యంత భద్రత

నియోజకవర్గ ఈఆర్‌వో రవీంద్రరావు



అన్ని పార్టీల ప్రతినిధుల సమావేశం మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీంద్రరావు

నందిగామ: కౌంటింగ్ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాత్రి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర రావు మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో 222 పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించి అసెంబ్లీ ఓట్లను కళాశాలలోని మూడవ అంతస్తు ఆడిటోరియంలో లెక్కింపు నిర్వహిస్తామన్నారు. దీనికిగాను 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి అదే కళాశాలలోని రెండవ అంతస్తులో మరో 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 16 రౌండ్లలో లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు అదనంగా మరో నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. దీనికి అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ వై. సరస్వతి, మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, అన్ని పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

వైద్య సేవలపై డీఎంహెచ్‌ఓ ఆరా



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు ప్రసూతి సేవలు అందుబాటులో ఉండటంతో వాటిని పరిశీలించేందుకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సోమవారం అర్ధరాత్రి పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. జి. కొండూరు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించి అర్ధరాత్రి వేళల్లో అందుతున్న సేవలు, సిబ్బంది అందుబాటును తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో కాన్పు కోసం వచ్చిన గర్భిణులు, బాలింతల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రోజుల్లో మరిన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రాత్రి వేళల్లో విధుల్లో లేకున్నా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.